క్లుప్తంగా

బీజేపీకి బుద్ధి చెబుతాం



రెంజల్(బోధన్): రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీల వర్గీకరణకు వత్తాసు పలికితే వచ్చే ఎనికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెబుతామని మాల మహానాడు మండల నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం సాటాపూర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ప్రధాని మోదీకి, బీజేపీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రానున్న ఎన్నికల్లో రాజకీయ పబ్బం గడుపుకునేందుకు కాలం చెల్లిన ఎస్సీ వర్గీకరణను తెరమీదకు తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు సాయిలు, కిరణ్, శ్రీకాంత్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



నవీపేట : ఈనెల 15న బోధన్‌లో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు కోరారు. సీఎం కేసీఆర్ తలపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా లాభం లేదని, మరోమారు బీఆర్‌ఎస్‌కు అధికారాన్ని అప్పగించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనవెంట బీఆర్‌ఎస్ నాయకులు భవంతి దేవీదాస్, నర్సింగ్‌రావు, సాయిబాబాగౌడ్, తెడ్డు పోశెట్టి, లోకం నర్సయ్య, బాబురావు, సుదర్శన్ ఉన్నారు.

ప్రకటనల నిలిపివేత తగదు



మోర్తాడ్: మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) మార్గదర్శకాల ప్రకారమే కాంగ్రెస్ ప్రకటనలు ఇచ్చిందని, అయినప్పటికీ టీవీల్లో పార్టీ ప్రకటనలు నిలిపివేయడం తగదని పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. మోర్తాడ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్‌ను స్వతంత్రప్రతిపత్తి ఉన్న సంస్థగా దేశ ప్రజలు చూస్తున్నారని, అయినప్పటికీ ఇలాంటి నిర్ణయాలు బాధాకరమన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. సమావేశంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



బోధన్: ఎన్డీఎస్ఎల్ కార్మికుల రిలే దీక్షలు సోమవారం నాటికి 101 రోజుకు చేరాయి. దీక్షలో కార్మికులు శ్రీధర్, నాగేశ్వర్‌రావు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటు ఫ్యాక్టరీ ప్రైవేట్ యాజమాన్యం, ఇటు ప్రభుత్వం తమ బకాయి వేతనాలు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార, ప్రతిపక్ష నాయకులు సైతం బకాయిలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు.

నృసింహునికి ప్రత్యేక పూజలు



ఎడపల్లి: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని మండలంలోని జానకంపేట శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టముకి కోనేరులో స్నానాలు ఆచరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీపీల్లో రికార్డుల తనిఖీ



బాల్కొండ: మెండోరా మండలం సావెల్, వెల్కటూర్ గ్రామ పంచాయతీల రికార్డులను ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీకి కేటాయించిన నిధులను సరిగి వినియోగించారా? లేదా? అనే అంశాలను పరిశీలించారు. పల్లెప్రగతిలో మంజూరైన నిధుల వివరాలను పరిశీలించారు. పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట సర్పంచులు నేల్ల లావణ్య, గంగారెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

తొలి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలిస్తాం

- ప్రతి ఏడాది ఉద్యోగ క్యాలెండర్
- కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్



సునీల్‌తో హనుమాన్ సంఘం సభ్యులు

భీమ్‌గల్: కాంగ్రెస్ అధికారంలో కి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు ప్రతి ఏడాది ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ హామీ ఇచ్చారు. మండలంలోని దేవన్‌పల్లి, బాబానగర్, లింగాపూర్ గ్రామాల్లో సునీల్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం కల్పించి బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి అభివృద్ధి పనులకు ఒకే కాంట్రాక్టర్‌ను పెట్టుకొని నియోజకవర్గ ప్రజలను దోపిడీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ క్రింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని అన్నారు. రైతులకు ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ, పంట పెట్టుబడి సహాయం కింద సంవత్సరానికి ఎకరానికి రూ.15 వేలు, భూమి లేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు అందిస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ. 2500 జమ చేస్తామని, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సునీల్‌ను కలిసిన హనుమాన్ సంఘం సభ్యులు

భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన మున్నూరుకాపు హనుమాన్ సంఘం సభ్యులు సుమారు 45 మంది ముత్యాల సునీల్‌ను మోర్తాడ్‌లోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

బీడీ కార్మికుల పింఛన్‌ను పెంచుతాం



కిసాన్‌నగర్‌లో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి



మంత్రికి బోనాలతో స్వాగతం పలుకుతున్న జలాల్‌పూర్ గ్రామస్తులు

- మరోసారి ఆశీర్వదించండి
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ/వేల్పూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడో సారి ఏర్పడిన వెంటనే బీడీ కార్మికులకు రూ.5 వేల పింఛన్ అందిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్, ఇత్వార్‌పేట్, జలాల్‌పూర్, వేల్పూర్ మండలం పడగల్, పోచంపల్లి, అంక్సాపూర్ గ్రామాల్లో మంత్రి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచిన వెంటనే బీడీ కార్మికులకు ప్రస్తుతం అందుతున్న రూ.2 వేల పింఛన్‌ను ఏడాదిలో రూ.3వేలు, తరువాత ఏడాదికి 500 చొప్పున పెంచుతూ రూ.5వేలు అందిస్తామన్నారు. రూ.5 వేల పింఛన్ ఇవ్వకుంటే మళ్లీ గ్రామాల్లోకి రానివ్వొదన్నారు. తనను మళ్లీ ఒకసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతానన్నారు. ప్రతి మారుమూల గ్రామానికి సైతం డబుల్ రోడ్డు చేసుకున్నామన్నారు. రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతోపాటు సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాదిరిగా కేసీఆర్ తప్పుడు హామీలు ఇవ్వరన్నారు. పల్లెల్లో ప్రభుత్వ పథకాలు అందని కొంత మందికి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అందిస్తామన్నారు. జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు, ఐడిహెచ్ఎఫ్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, జెడ్పీటీసీ దాసరి లావణ్య, ఎంపీపీ లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచులు తులసి, కల్పన, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, వేల్పూర్ మండలం బీఆర్‌ఎస్ నాయకులు ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, మిట్టపల్లి మహిపాల్, శ్యాంరావు, హన్మంత్‌రెడ్డి, రాజ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత నాదే..

- ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి



మాందాపూర్‌లో మాట్లాడుతున్న పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: ఒక్కసారి తనను గెలిపిస్తే అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తానే తీసుకుంటానని ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని ధర్మోరా, మాందాపూర్ గ్రామాల్లో రాకేశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమలం పువ్వుకు ఓటేసి గెలిపించాలని, పదేళ్లుగా ఎలాంటి సంక్షేమ పథకాలు అందక అభివృద్ధికి నోచుకోని పేదలందరినీ అభివృద్ధిలోకి తెస్తానని అన్నారు. గుండా రాజకీయాలను అంతం చేస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా నడుకుంటానని అన్నారు. నిరుద్యోగులందరికీ తన వంతుగా ఉద్యోగాలు ఇప్పించే బాధ్యతకూడా తీసుకుంటానని అన్నారు. అంతకు ముందు రెండు గ్రామాల్లోనూ మహిళలు మంగళ హారతులతో రాకేశ్‌రెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్, గంగోనే సంతోష్, గోవూరు ఒడ్డెన్న, సుంకరి రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో ఉపసర్పంచ్ చేరిక

మండలంలోని అమ్రాద్ ఉపసర్పంచ్ సతీశ్‌తో పాటు గంగపుత్ర సంఘం సభ్యులు బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న ఆధ్వర్యంలో చేరిన వారికి, రాకేశ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధి, సంక్షేమమే నా ప్రచారాస్త్రాలు

- రూ.3వేల కోట్లతో పనులు చేపట్టా
- ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి



మంథని గ్రామస్తులకు గులాబీ కండువాలు కప్పుతున్న జీవన్‌రెడ్డి



జీవన్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందజేస్తున్న రాజరాజేశ్వర ఆలయ పండితులు

ఆర్మూర్: అభివృద్ధి, సంక్షేమమే తన ప్రచార అస్త్రాలని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. అంకాపూర్‌లోని ఆయన నివాసంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. మంథనికి చెందిన కాంగ్రెస్, బీజేపీల నాయకులు పెద్దసంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. యువసేన యూత్, అంబేడ్కర్ యువజనసంఘం, బుల్స్ యూత్, ఈగల్స్ యూత్, అరుంధతి యూత్, న్యూ ఫ్లాట్స్ యూత్, ముదిరాజ్ సంఘం, పూసల సంఘం, మాల సంఘం, మాదిగ సంఘం ప్రతినిధులు బీఆర్‌ఎస్‌లో చేరినవారిలో ఉన్నారు. ఆర్మూర్, నందిపేట, మాక్లూర్ మండలాల్లోని పలు గ్రామాల యువజన సంఘాల సభ్యులు సైతం పార్టీలో చేరగా, జీవన్‌రెడ్డి వారందరికీ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి తనకు ఓటు వేయాలని, తన హ్యాట్రిక్ విజయంలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు. సీఎం కేసీఆర్ వద్ద ఉన్న సాన్నిహిత్యంతో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సాధించడంలో తాను సఫలమైనట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సు మారు రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశానన్నారు. నియోజకవర్గంలో 62 వేల మందికి రూ.2016, రూ.4016 చొప్పున ఆసరా పింఛన్లు, 62 వేల మందికి రైతు బంధు ద్వారా పెట్టుబడి సా యం అందించడంతోపాటు అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ చౌరస్తాలను సుందరీకరించానని అన్నారు. ఆర్మూర్ పట్టణంలో వివిధ కులాలకు 17 ఫంక్షన్ హాళ్ల నిర్మాణం పూర్తి చేశామని, సిద్దులగుట్టకు రూ.20 కోట్లతో ఘాట్ రోడ్డు, రూ. 120 కోట్లతో పంచగూడ వంతెన నిర్మాణం, నియోజకవర్గమంతా రూ. 500 కోట్లతో రోడ్లు, 11కు పైగా బైపాస్ రోడ్ల నిర్మాణం, ఆర్మూర్‌కు వంద పడకల ఆస్పత్రి సాధించానన్నారు.

వేములవాడలో పూజలు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో జీవన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. జీవన్‌రెడ్డి వెంట ఆయన సతీమణి రజితరెడ్డి, కూతుళ్లు అనోషికరెడ్డి, అనన్యరెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో నాయకుల ప్రచారం



సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఉప్లూర్‌లో ప్రచారం చేస్తున్న సునీల్‌రెడ్డి సతీమణి దీప్తి

ఎడపల్లి(బోధన్)/కమ్మర్‌పల్లి/మోర్తాడ్(బాల్కొండ): బోధన్, బాల్కొండ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఎడపల్లి మండలం బాపునగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, జైతాపూర్ మాజీ సర్పంచ్ సూరిబాబు, సింగిల్ విండో చైర్మన్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు లింగం, సాయిలు తదితరులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో ముత్యాల సునీల్‌రెడ్డి సతీమణి దీప్తి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. సునీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, అవారి సత్యం, బోనగిరి లక్ష్మణ్, కొమ్ముల రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఏర్గట్ల మండలం తడపాకల్‌లో కాంగ్రెస్ నాయకులు దీపాలతో చేయి గుర్తును ఏర్పాటు చేసి వినూత్న రీతిలో ప్రచారం చేశారు.

నల్ల పోచమ్మ, శివాలయాల్లో పూజలు



సిద్దుల గుట్టపై స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి రజితరెడ్డి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఉన్న శివాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సతీమణి రజితరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత కుటుంబ సభ్యులు శివలింగానికి అభిషేకం చేశారు. పల్లకీ సేవ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, నక్కల లక్ష్మణ్, అయ్యప్పశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆశన్నగారి జీవన్‌రెడ్డి మరోసారి విజయం సాధించాలని కోరుతూ భారత జాగృతి నాయకులు నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబస్టాండ్ నుంచి ఆలయం వరకు వంద మంది యువకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ పస్క నర్సయ్య, సీనియర్ నాయకుడు మోత్కూరి లింగగౌడ్, నీరగొండ సాయిలు, పోగరి సంజీవ్ నవీన్‌యాదవ్, భూమేశ్, అల్లెపు రాకేశ్, శరత్, నవీన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో టీఈ సీహెచ్ హరిచంద్ సోమవారం తెలిపారు. ఆర్మూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మోర్తాడ్: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన శ్రీమతి అనే మహిళకు బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి అండగా నిలిచారు. ఆయన సూచన మేరకు స్థానిక నాయకులు బాధితురాలికి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

పార్టీల్లో చేరికలు..

సాక్షి నెట్‌వర్క్ : మాక్లూర్ మండలం బోర్గాం (కె) శివారులోని గాంధీనగర్‌కు చెందిన పలువురితో పాటు నందిపేట మండల ప్రైవేట్ బస్ అసోసియేషన్ సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరారు. బాల్కొండ మండలం వేంపల్లి గ్రామపంచాయతీ వార్డు సభ్యులతోపాటు ముప్కాల్ మండలం ఎస్టీ సంఘం ప్రధాన కార్యదర్శి తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. హాసాకొత్తూర్ రెడ్డి సంఘం యువ కులు, ఎస్సీ సంఘం, నాగంగపేట్ మహిళలు, లక్కోర వింగ్స్ యూత్ సభ్యులతోపాటు ఉప్లూర్, కమ్మర్‌పల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరా రు. నందిపేట మండలం చౌడమ్మకొండూర్ ఎంపీటీసీ, సొసైటీ డైరెక్టర్, టీఆర్‌ఎస్ గ్రామ అధ్య క్షుడితోపాటు కొండూర్, కొత్తూర్‌కు చెందిన 200 మంది బీజేపీలో చేరారు. రెంజల్, వీరన్నగుట్టకు చెందిన పలువురితోపాటు భీమ్‌గల్ మండలం పురాణీపేట్‌కు చెందిన మైనార్టీ నాయకుడు కాంగ్రెస్‌లో చేరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – టైగర్ 3 (తెలుగు)- 10.25
దీ మార్వెల్స్(తెలుగు)-1.50, 7.10, 9.45
దీపావళి (తెలుగు) - 04.25
స్క్రీన్-2 – జపాన్ (తెలుగు)- 12.10, 3.30, 6.50, 10.10
స్క్రీన్-3 – జపాన్ (తెలుగు)- 10.00
కీడా కోలా(తెలుగు)- 1.20
జిగర్ తండ డబుల్‌ఎక్స్ (తెలుగు)- 4.00, 10.25
స్క్రీన్-4 – టైగర్ 3 (తెలుగు)- 11.45, 3.10, 6.35, 10.00

పదిహేను నామినేషన్ల తిరస్కరణ

బోధన్/భీమ్‌గల్/ఆర్మూర్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సోమవారం నామినేషన్ల స్క్రూటినీని అధికారులు చేపట్టారు. బోధన్‌లో ఎనిమిది, బాల్కొండలో రెండు, ఆర్మూర్‌లో ఐదు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బోధన్‌లో సింగాడే పాండు(బీఎస్పీ), గైని రాములు (ఇండియన్ ప్రజా బంధు పార్టీ), సుదర్శన్‌రెడ్డి (ఎన్‌సీపీ), సురేందర్ తోడే (యుగతులసి పార్టీ), స్వతంత్ర అభ్యర్థులు గంధం రాజేశ్(స్వతంత్ర), టీ నవీన్‌కుమార్(స్వతంత్ర), మహ్మద్ అర్షద్ పాషా(స్వతంత్ర), ఎండీ యూసుఫ్(స్వతంత్ర) నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బాల్కొండ నియోజకవర్గానికి దాఖలైన నామినేషన్లలో యష్‌పాల్ పన్నాల (యుగతులసి పార్టీ), కొండ రఘునాథ్(స్వతంత్ర), ఆర్మూర్ నియోజకవర్గానికి దాఖలైన వాటిలో ఆశన్నగారి రజితరెడ్డి(బీఆర్‌ఎస్), తొగరి భూషణ్(యుగతులసి పార్టీ), కుంట జీవన్(అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), పైడి సుచరితరెడ్డి (స్వతంత్ర), చెన్న శ్రీమాన్(స్వతంత్ర) నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.

బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలవాలి



మాట్లాడుతున్న కోటపాటి నర్సింహనాయుడు

బాల్కొండ: గల్ఫ్ బాధితులు బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలువాలని ప్రవాస భారతీయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు కోరారు. ముప్కాల్ మండలకేంద్రంతోపాటు మండలంలోని వేంపల్లి గ్రామంలో గల్ఫ్ బాధితులతో సోమవారం ఆయన మాట్లాడారు. గల్ఫ్‌బాధితుల కోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేకమార్లు చర్చలు సాగాయన్నారు. గల్ఫ్‌బాధితులను ఆదుకునేది కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డికి అండగా నిలువాలని కోరారు. ముప్కాల్ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, నాయకులు సామ వెంకట్‌రెడ్డి, జక్క గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సభాస్థలి పరిశీలన

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ శివారులోని నర్సాపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభాస్థలిని సీసీ కల్మేశ్వర్ సోమవారం పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్ నుంచి బోధన్‌కు వచ్చే, బోధన్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్లే వాహనాల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీపీ వెంట ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాసరాజు ఉన్నారు.

పాస్ పోర్టు పోయినది

ట్రెండ్ల నందు S/o. ట్రెండ్ల బజన్న, R/o.H.No:3-81 ఉప్లూర్,మం॥ కమ్మర్‌పల్లి, నిజామాబాద్. తేది08.11.2023 నాడు కోరుట్ల నుండి కమ్మర్‌పల్లికి బైక్‌పై వెళ్తుండగా W8720122 నెం. గల ఇండియన్ రిపబ్లిక్ పాస్‌పోర్ట్ పోయినది. దొరికినవారు ఈ క్రింది నెం. సంప్రదించండి. Cell:9640727476

మన్మథస్వామి దర్శనానికి పాదయాత్ర ప్రారంభం



సుంకిని సిద్ధేశ్వర స్వామితో వీరశైవులు

బోధన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వీరశైవ జంగమ, లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో కొలువైన వీరశైవుల ఆరాధ్యదైవం మన్మథ స్వామి పుణ్యక్షేత్ర దర్శనానికి 14వ మహాపాదయాత్ర ప్రారంభమైంది. పట్టణంలోని జంగమగల్లీలో ఉన్న వీరశైవుల పురాణే మఠంలో శివపార్వతులు, మన్మథస్వామి చిత్రపటాలకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోటగిరి మండలంలోని సుంకినికి చెందిన వీరశైవుల గురువు సిద్ధేశ్వర స్వామి పాదయాత్రను ప్రారంభించారు. అక్కడినుంచి ఏకచక్రేశ్వరాలయానికి చేరుకుని శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. సమాజ్ ప్రతినిధులు కర్నె హన్మంత్‌రావు, నర్సింగ్ అప్ప, లక్ష్మణ్ పటేల్, సంతోష్ మహరాజ్, శంకరప్ప, రాజేందర్ కుమార్, విఠలప్ప, పురాణే అజయ్‌కుమార్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి





సాక్షి నెట్‌వర్క్ : దీపావళి పండుగను ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో లక్ష్మీదేవి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పటాకులు కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. ఆర్మూర్, నందిపేట, మాక్లూర్, ఆలూర్, డొంకేశ్వర్ మండలాల్లో సుమారు రూ.4కోట్ల విలువైన పటాకులు అమ్మకాలు జరిగాయి. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు పార్కులో ఉన్న బుద్ధ విగ్రహం వద్ద బౌద్ధ దీపావళి వేడుకలను నిర్వహించారు. ప్రఖ్యాత బౌద్ధబిక్షు బంతే ధమ్మరక్షిత పాల్గొన్నారు.